సాక్షి జనగామ

మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



ఉన్నతవిద్యను బలోపేతం చేయాలి
ఉన్నత విద్యను బలోపేతం చేసేందుకు బడ్జెట్‌లో నిధులు ఎక్కువ కేటాయించాలని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు.
- 8లో▸



సైన్స్‌తోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం
నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సైన్స్‌తోనే సాధ్యమైందని సీసీఎంబీ మాజీ డైరెక్టర్ మోహన్‌రావు అన్నారు.
- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం 37°/23°

వాతావరణం
ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత కాస్త తగ్గుతుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది. రాత్రి సమయంలో ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

నేడు పంచాంగ శ్రవణం

పాలకుర్తి: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శ్రీ క్రోధినామ సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకొని స్వామివారి కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జాతర బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలి



పాలకుర్తి టౌన్: వల్మిడి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఈనెల 13 నుంచి 23 వరకు జరిగే జాతర బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జాతర బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. 17న శ్రీరామనవమి రోజున నిర్వహించే శ్రీసీతారామ చంద్రస్వామి కల్యాణోత్సవానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం



జనగామ: జిల్లా వ్యాప్తంగా మంగళవారం (నేటి) నుంచి శ్రీ రామనవమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాలతో పాటు జిల్లా కేంద్రంలోని 27వ వార్డు పాత బీట్‌బజార్, శ్రీ నగరేశ్వర కన్యకాపరమేశ్వరి సీతారామచంద్ర స్వామి ఆలయం(వైశ్యభవన్), శ్రీ సంతోషిమాత, గుండ్లగడ్డ ఉమామహేశ్వరస్వామి టెంపుల్, గిర్నిగడ్డ, సుభాష్‌నగర్, హనుమకొండ రోడ్డులోని ఆంజనేయస్వామి తదితర ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ దీపాల అలంకరణతో పాటు భక్తులకు ఇబ్బంది లేకుండా చలువ పందిళ్లు, రోజువారీ అన్న ప్రసాదాలు తదితర సేవా కార్యక్రమాల నిర్వహణకు ప్లాన్ చేస్తున్నారు.

భువనగిరి అబ్జర్వర్‌గా జమాల్ షరీఫ్



జనగామ: కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అబ్జర్వర్‌గా జనగామకు చెందిన పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ వైస్ చైర్మన్ జమాల్ షరీఫ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ మైనార్టీ డిపార్ట్‌మెంట్, తెలంగాణ ఇన్‌చార్జ్ ఫర్హాన్ అజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉచిత శిక్షణ గడువు పొడిగింపు

జనగామ: రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరం యూపీఎస్సీ, సీఎస్ఏటీ పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ గడువు పెంచినట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం, దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూట్ టెస్ట్ ప్రవేశానికి సాధారణ ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన మైనారిటీ అభ్యర్థులు www.imrestelangana.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 15వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చివరి తేదీ ఈనెల 22 వరకు ఉందని, ప్రవేశ పరీక్ష ఈనెల 28న జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్సియల్ పాఠశాలలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించకూడదని ఈ సందర్భంగా వివరించారు.



మామిడి కొమ్మలు, కాయలు కొంటున్న మహిళలు

ఉగాది ఉషస్సు..

- జిల్లాలో పండుగ సందడి



ఉగాది పచ్చడి తయారీకి కుండల కొనుగోలు..

జనగామ: తెలుగు ప్రజల ఉగాది పండుగ రానేవచ్చింది. గుమ్మాలకు మామిడి తోరణాలు, షడ్రుచులతో తయారు చేసిన పచ్చడి, సంప్రదాయ వంటకాలతో శ్రీ క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలకడానికి జిల్లా ప్రజలు సన్నద్ధమయ్యారు. మంగళవారం నుంచి నూతన తెలుగు సంవత్సరాది ఆరంభం కానుంది. శిశిర రుతువుకు వీడ్కోలు పలికి.. వసంత రుతువును ఆహ్వానిస్తూ జరుపుకునే ఉగాది పర్వదినం రోజు పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు రుచుల పదార్థాలతో సిద్ధం చేసిన ఉగాది పచ్చడిని ఇష్టదైవాలకు ఆరగించడం ఆనవాయితీ. తర్వాత సాయంత్రం ఆలయాల్లో నిర్వహించే పంచాంగ శ్రవణ కార్యక్రమంలో కుటుంబాల సమేతంగా పాల్గొని ఏడాదిలో జరుగబోయే మంచి చెడులు, ఆదాయ వ్యయాలు తెలుసుకుంటారు. ఇదిలా ఉండగా.. పండుగ నేపథ్యంలో మామిడి కొమ్మలు, మామిడి కాయలు, పచ్చడి తయారీకి కుండలు, పూలు, వేపపూవు, దండల కొనుగోళ్లతో సోమవారం జిల్లా కేంద్రంలో పండుగ సందడి కనిపించింది.

◆ శ్రీక్రోధి నామ సంవత్సరానికి స్వాగతం - 8లో▸

ముందస్తు సంబరాలు



ముందస్తు ఉగాది సంబురాల్లో పాల్గొన్న మహిళలు

జనగామ: శోభాకృత నామ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ.. శ్రీ క్రోధినామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వాసవీ క్లబ్ వనిత గ్రేటర్ జనగామ ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్‌కుమార్ పర్యవేక్షణలో క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ మాదంశెట్టి వరూధిని, కార్యదర్శి గంగిశెట్టి అనూజ, కోశాధికారి పులిగిల్ల నాగమణి నేతృత్వంలో గుండ్లగడ్డకు చెందిన ఉప్పల లక్ష్మి స్వగృహంలో తయారు చేసిన ఉగాది పచ్చడి, పులిహోర వంటకాలను దేవుడికి నివేదించాక సామూహిక భోజనం చేశారు. అనంతరం 10 మందికి చీరలతో పాటు నిత్యావసర వస్తువులు అందజేశారు. నేటి తరం యువతీ యువకులు, పిల్లలకు మన సంప్రదాయాలు తెలియజేయడానికి ఈ కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందని డాక్టర్ మాదంశెట్టి వరూధిని పేర్కొన్నారు.

వ్యాపార అడ్డా ఎంజీఎం

- నిబంధనలకు తిలోదకాలు
- గత ప్రజాప్రతినిధుల అండతో వెలిసిన దుకాణాలు
- ఫుడ్ లైసెన్సులుండవు.. టెండర్ ప్రక్రియ అసలే ఉండదు!
- అద్దె సైతం చెల్లించరు
- మాకెవరు అడ్డు అంటున్న నిర్వాహకులు
- మంత్రి ఆదేశాలతో నోటీసులిచ్చి చేతులు దులుపుకున్న అధికారులు





ఎంజీఎం ఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహిస్తున్న దుకాణ సముదాయాలు

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి పాలన గాడి తప్పుతోంది. ఆస్పత్రిలో హెచ్‌డీఎస్ సమావేశం ఉండదు. హెచ్‌డీఎస్ కమిటీలుండవు. టెండర్ లేకుండానే కలెక్టర్ అనుమతులున్నాయంటూ.. ఎప్పుడు ఏ కొత్త దుకాణం ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటవుతుందో అర్థం కాని పరిస్థితి. కలెక్టర్ అనుమతులిచ్చినా దుకాణ సముదాయాల్లో విచ్చలవిడిగా నాసిరకం వస్తువులు విక్రయిస్తూ.. అటెండెంట్ల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అయినా.. పట్టించుకునే వారు లేకుండా పోయారు. సూపరింటెండెంట్ చాంబర్ పక్కనే ఉన్న డాక్టర్స్ క్యాంటీన్ అద్దె చెల్లించకపోయినా అధికారులు పట్టించుకోడం లేదు. ఇలా ఆస్పత్రి ప్రాంగణంలో గత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, నేతల అండతో విచ్చలవిడిగా దుకాణ సముదాయాలు వెలిశాయి. ఆస్పత్రి క్యాజువాలిటీ ప్రాంతమంతా ఓ కమర్షియల్ స్ట్రీట్‌గా మారిపోయింది.

రూ.8.5 లక్షల మేర బకాయిలు

గత సంవత్సరం డిసెంబర్ 31న మంత్రి కొండా సురేఖ ఎంజీఎం ఆస్పత్రిలో సమీక్ష నిర్వహించి ఆస్పత్రి ప్రాంగణంలో దుకాణ సముదాయాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఆస్పత్రిలో ఎన్ని దుకాణ సముదాయాలున్నాయి.. ఎంత మేరకు అద్దె బకాయి ఉంది? వారు ఎందుకు చెల్లించడం లేదనే అంశాలపై మంత్రి పరిపాలనాధికారులను ప్రశ్నించారు. అనుమతులు లేని షాపులను వెంటనే తొలగించడంతో పాటు అద్దె చెల్లించని వారికి నోటీసులు అందజేసి వెంటనే ఆస్పత్రి నుంచి ఆ దుకాణా సముదాయాలను తొలగించాలని ఆదేశించారు. ఈమేరకు జనవరిలో ఎంజీఎం పరిపాలనాధికారులు నోటీసులు జారీ చేశారు. మొత్తం రూ.8.5 లక్షల మేర బకాయిలున్నప్పటికీ కేవలం రూ.92 వేలు మాత్రమే చెల్లించారు.

అనుమతులు ఒకటి.. విక్రయాలు మరోటి

ఆస్పత్రి ప్రాంగణంలో రోగుల అటెండెంట్ల సౌకర్యార్థం ఫార్మసీ, క్యాంటీన్, రిటెయిల్ షాపు, విజయ డెయిరీ, టెలిఫోన్ బూత్ నిర్వహణ కోసం అనుమతులు తీసుకున్న వ్యాపారస్తులు విచ్చలవిడిగా నాసిరకం వస్తువులు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన క్యాంటీన్ నిర్వహణ పూర్తి అధ్వానంగా ఉందని, నాసిరకం పదార్థాలు విక్రయిస్తున్నారని రోగుల అటెండెంట్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నోటీసులిచ్చాం

ఎంజీఎం ఆస్పత్రి ప్రాంగణంలో అద్దె చెల్లించని దుకాణసముదాయాల బాధ్యులకు నోటీసులు జారీ చేశాం. దీంతో రూ.92వేలు వసూలయ్యాయి. ప్రస్తుతానికి ప్రాంగణంలోని దుకాణ సముదాయాల ద్వారా ఆస్పత్రి అభివృద్ధికి రూ.7,13,465 ఆదాయం రావాలి. నిర్వాహకులకు మరోసారి నోటీసులు జారీ చేశాం. ఎలాంటి స్పందన కనిపించడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మరోసారి చర్యలు చేపడతాం.

- శ్రీనివాస్, ఆర్‌ఎంఓ, ఎంజీఎం

‘సర్కిల్’ సైకిల్ సవారీ..

- వారానికో పోలీస్ స్టేషన్ పరిధిలో పర్యటిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి
- క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకుంటూ..



సైకిల్‌పై వస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

దేవరుప్పుల : ఒకప్పుడు పల్లెల్లో సబ్‌ఇన్‌స్పెక్టర్ మోటారు సైకిల్‌పై మఫ్టీలో తిరిగి శాంతి భద్రతలను పర్యవేక్షించేది. అలాంటి ప్రక్రియకు ఇప్పుడు పాలకుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన గట్ల మహేందర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు.. అయితే అది ద్విచక్రవాహనపై కాదు.. తన సైకిల్‌పైనే. సోమవారం ఉదయం పాలకుర్తి నుంచి దేవరుప్పులలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు సైకిల్‌పై చేరుకున్నారు. అనంతరం సీతారాంపురంలోని అనాథ శరణాలయాన్ని సందర్శించారు. తర్వాత కడవెండి శివారు శ్రీ వానకొండయ్య లక్ష్మీనర్సింహస్వామి జాతర వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ క్రమంలో రోడ్డు పక్కనే నిర్వహిస్తున్న ధాన్యం కాంటాదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి రోడ్డు భద్రత నిబంధనలపై వివరించారు. 4.38 నిమిషాలకు ఒక కిలోమీటరు చొప్పున పాలకుర్తి, దేవరుప్పుల పరిధి సుమారు 20 గ్రామాలను మూడున్నర గంటల్లో(54.45 కిలోమీటర్లు) సైక్లింగ్‌తో సందర్శించారు. ఈ సందర్భంగా సీఐని ‘సాక్షి’ పలకరించగా నేటికీ యూనిఫామ్ చూసి ప్రజలు నిజాలు చెప్పడానికి వెనుకాడుతున్నారు.. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోవడానికి సైకిల్‌పై వారానికి ఒకసారి ఇలా తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఓ బాలికను కదిలించగా టీజింగ్ విషయం బయటపడిందన్నారు.



కడవెండి శివారులో ధాన్యం కాంటా వద్ద..



సీతారాంపురం శరణాలయంలో..

రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర

సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్



మాట్లాడుతున్న జహంగీర్

జనగామ: భారత రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ కుట్ర చేస్తోందని సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ.జహంగీర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సాంబరాజు యాదగిరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్న సమయంలో పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి కనకారెడ్డి మాట్లాడుతూ ప్రజాసమస్యలపై పోరాడే జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాపర్తి రాజు, ఇర్రి అహల్య, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, జోగు ప్రకాష్, సుంచు విజేందర్, బోట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్‌డీఓ, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డీఎస్ వెంకన్న అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ పరిధి పలు మండలాలకు చెందిన తహసీల్దార్లతో స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వీప్(సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్‌డీఓ ప్రారంభించారు. డీటీ విజయ్‌కుమార్, ఆర్‌ఐలు అర్జున్, రవీందర్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి



కొత్తపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ మొగిలప్ప

లింగాలఘణపురం: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని డీఆర్‌డీఓ మొగిలప్ప అన్నారు. సోమవారం కొత్తపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన.. ఆయా కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కేంద్రాలకు ఇంకా బార్దాన్(గోనెసంచులు) రాలేదని పలువురు రైతులు డీఆర్‌డీఓ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి గోనెసంచులు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట డీపీఎం రాజేంద్రప్రసాద్, ఏపీఎం శంకరయ్య, సీసీ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

12న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

జనగామ: జిల్లా కేంద్రం ధర్మకంచ మినీ స్టేడియంలో ఈనెల 12న జిల్లా స్థాయి అండర్–14, 16, 18, 20 పురుషులు, బాల బాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28న సూర్యాపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు శుక్రవారం ఉదయం 9 గంటలకు జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు గంగిశెట్టి మనోజ్‌కుమార్ (98850 46437), ఆవుల అశోక్(99124 53220), వంచ చంద్రశేఖర్‌రెడ్డి(77995 52233)లను ఆయా నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా



అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

జనగామ: పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువత ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ నిరుద్యోగ యువతకు నిర్వహించే శిక్షణ కార్యక్రమాలను సోమవారం జిల్లా కేంద్రం ధర్మకంచలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన ప్రారంభించారు. 86 మంది దరఖాస్తు చేసుకోగా మూడు నెలల శిక్షణ తరగతులకు 55 మంది హాజరైనట్లు ఎస్సీ అభివృద్ధి అధికారి దయానందరాణి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూన్‌లో గ్రూప్–1, ఆగస్టులో గ్రూప్–2 పరీక్షలతో పాటు ఉపాధ్యాయ పరీక్షలు నిర్వహిస్తుందని, సన్నద్ధమవుతున్న షెడ్యూల్ కులాల యువత ఉద్యోగాల సాధనకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అధ్యాపకులు, నిర్వాహకులు కవిత, సీహెచ్. రామనర్సయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పన పనులు పూర్తి చేయాలి

రఘునాథపల్లి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక స్టేషన్ కాలనీలో పురోగతిలో ఉన్న అమ్మ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పనులను పరిశీలించారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ప్రహరీ, గేట్ తదితరాల గురించి ఆరా తీసిన ఆయన.. ఈ పనులన్నీ 15 రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం కోమళ్ల జీపీ పరిధిలోని మిషన్ భగీరథకు సంబంధించిన ఎస్టీఎఫ్ కింద చేపట్టిన పైపులైన్ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని ఏఈని ఆదేశించారు. తాగు నీటికి ఇబ్బంది లేకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రకారం అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. జీపీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, డీఈఓ రాము, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, ఏఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను రక్షించాలి

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



ఉపాధి పనుల వద్ద మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

బచ్చన్నపేట : గ్రామ వన నర్సరీలు, పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలను రక్షించాలి.. ఇందుకు జీపీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. సోమవారం తమ్మడపల్లిలో ఈజీఎస్ పని ప్రదేశంతోపాటు వన నర్సరీ, బచ్చన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం, వన నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని తొందరగా తూకం వేసి మిల్లులకు తరలించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. బచ్చన్నపేట పల్లె ప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోగా ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్.. జీపీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీరు పట్టాలని చెప్పారు. జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, డీపీఓ వినోద్‌కుమార్, తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీఓ రఘురామకృష్ణ, ఏపీఓ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మృతికి కారణమైన ఏఈని సస్పెండ్ చేయాలి



ఏడీఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జనగామ : స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ పాలకుర్తిటౌన్ సెక్షన్‌లో పనిచేస్తున్న విద్యుత్ కార్మికుడు శ్రీశైలం మృతికి కారణమైన ఏఈ రణధీర్‌ను సస్పెండ్ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యాన సోమవారం ఎస్ఈ కార్యాలయంలో ఏడీఈ ప్రభావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు రాపర్తి రాజు, కుమారస్వామి మాట్లాడుతూ సబ్‌స్టేషన్‌లో మంటలు వస్తున్నాయని ఆపరేటర్లు చెబుతున్నా వినకుండా ఎల్‌సీ తీసుకొని అన్యాయంగా శ్రీశైలంను పొట్టనబెట్టుకున్నారని అన్నారు. ఏఈని సస్పెండ్ చేయడంతోపాటు మృతుడు శ్రీశైలం భార్యకు విద్యుత్ సంస్థలో శాశ్వత ఉద్యోగం కల్పించి, రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తాండ్ర ఆనందం, గంగరబోయిన మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు ప్రారంభం




పిల్లలకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

జనగామ: జిల్లాలోని ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సోమవారం నుంచి కంటి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 16 పాఠశాలల్లోని 3,816 మంది విద్యార్థులకు ఐదు రోజుల్లో కంటి పరీక్షల ప్రక్రియ పూర్తి చేస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ హరీష్‌రాజ్ తెలిపారు. ఇందుకు జిల్లాలోని ఆర్‌బీఎస్‌కే కంటి పరీక్షల టీంలను మూడుగా విభజించామని, ఒక్కో బృందం రోజుకు 250 చొప్పున 750 మంది పిల్లలకు కంటి పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


ఉగాది పర్వదిన శుభాకాంక్షలు











ఘనంగా విశ్వబ్రాహ్మణుల ఉగాది

విశ్వబ్రాహ్మణులు ఉగాది పండుగ వేడుకకు ముందు అమావాస్య రోజు తీగదారు పూలతో పందిరి ఏర్పాటు చేసి వారి కులదైవం వీరబ్రహ్మేంద్రస్వామిని ప్రతిష్ఠించుకుని పూజలు చేయడం ఆనవాయితీ. ఈ సందర్భంగా నగరంలోని పలువురు విశ్వబ్రాహ్మణులు ఉగాది పండుగను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. వారి వృత్తి సామగ్రిని మోదుగ పూలుతో అలంకరించి, భక్ష్యాలు, ఉగాది పచ్చడి నివేదన చేశారు.



పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

నేడు టీటీడీ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నేడు(మంగళవారం) పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశామని కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. అలాగే శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీమద్రామాయణ సప్తాహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు హనుమకొండలోని ఏకశిల పార్కులో గల సీతారామచంద్ర ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, వరంగల్‌లోని హంటర్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం సాయంత్రం పంచాంగ శ్రవణానికి తగిన ఏర్పాట్లు చేశామని ఆయన వెల్లడించారు.

కుజగ్రహం రాజుగా..



ఈ సంవత్సరం కుజగ్రహం రాజుగా ఉండడం జరుగుతోంది. క్రోధి అనే పేరుతో వస్తున్న ఈ కాలం క్రోధ స్వభావం కలిగిన కుజ గ్రహానికి రాజాధిపత్యం వచ్చింది. ఉగాది పండుగ తేదీ 9, వారం మంగళవారం కావడం వల్ల కుజగ్రహం సంపూర్ణంగా బలవంతుడై ఉంటాడు. ఈ సంవత్సరం కఠిన నిర్ణయాలు తీసుకోవడం, న్యాయపర విషయాల్లో గట్టి వైఖరి కలిగి ఉండడం సహజంగా ఏర్పడుతుంది. రాజు కుజుడు కావడంతో ప్రజలు, పాలకుల్లో క్రోధ, ఆవేశాలు పెరగడం, భూ సంబంధ వ్యవహారాలు ఉత్పన్నమవుతాయి. రాజకీయాల్లో ఊహించని పరస్పర వ్యతిరేకాలు తారాస్థాయికి చేరుతాయి.

- శివపురం రామలింగ ఆరాధ్య, విశ్రాంత అర్చకులు, కరీమాబాద్, వరంగల్

శ్రీక్రోధి నామ సంవత్సరానికి స్వాగతం



బంతిపూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



హన్మకొండ కల్చరల్ : తెలుగువారి పండుగల్లో యు(ఉ)గాది పండుగ మొట్టమొదటి. పంచాంగం ప్రకారం ప్రతీ ఉగాదికి ఒక్కో పేరు ఉంటుంది.38వది క్రోధి నామ సంవత్సరం. ఇది కోపం కలిగించేది అని చెప్తారు. 'యుగాది'లో యుగం అనగా వయస్సు, ఆది అనగా ప్రారంభమని అర్థం. ఉగాది పండుగ తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలకు కేంద్ర బిందువుగా ఆనందానికి, సౌభాగ్యానికి, ఆధ్యాత్మిక చింతనకు, పల్లెలలోని జానపదుల జీవనశైలికి సంకేతంగా నిలుస్తోంది. ఉగాది కాలానికి సంబంధించిన పండుగ. వేప చెట్లు అమృతాన్ని నింపుకున్న పూలతో ప్రకాశిస్తుండగా మామిడి చెట్లు లేలేత పిందెలతో మానవ కల్యాణానికి మంగళగీతాలు పాడుతుండగా మోదుగ చెట్లు నిప్పు కణికలాంటి పూలతో శోభాయమానం చేస్తుండే వసంతకాలంలో రమణీయమైన సొగసులతో అలరారే చైత్రమాసం ప్రారంభమవుతుంది. చైత్ర శుక్ల పాడ్యమి రోజున ప్రతియేటా ఈ పండుగను జరుపుకుంటారు. మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని నగరంలోని పలు కూడళ్లలో కొత్తకుండలు, మోదుగు పూలు, కొత్తచింతపండు, మామిడాకులు, కాయలు, వేప పూలు, చామంతి, గులాబీ, బంతి పూలు, గులాలు, పసుపు, కుంకుమ, గుగ్గిలం తదితర పూజా సామగ్రి అమ్మకాలు సాగాయి.

ఉగాది పచ్చడి ప్రత్యేకత..

ఆయా కాలాల్లో పండించిన వాటిని పండుగల సందర్భంగా దేవుడికి నివేదించిన అనంతరం స్వీకరిస్తాం. చైత్రమాసంలో లభించే చింతపండు, బెల్లం, మామిడి పిందెలు, వేపపూతను కొత్తకుండలో వేసి పచ్చడిగా చేసి భగవత్ నివేదనలుగా సమర్పిస్తారు. తెలంగాణలో ఉగాది పచ్చడిని పానీయంలాగే చేయడం సాంప్రదాయం. దీన్ని షడ్రుచుల సమ్మేళనంగా భావిస్తారు. నిజానికి ఉగాది ప్రారంభంలో మిరపకాయలు లేవు పూర్వం మిర్యాలు వాడేవారు. ఉగాది పచ్చడిలో కొందరు మిర్యాల పొడి వేయడానికి, ఉల్లిగడ్డ ముక్కలు వేయడానికి అదే కారణం. ఉప్పు కూడా కొద్దిగా వేస్తారు. ఉగాది పండుగరోజు దేవుడికి సమర్పించే నివేదనలలో కొత్తబెల్లం, కొత్త శనిగ పప్పు ఉడికించి చేసే భక్ష్యాలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఉగాది పచ్చడి ఎన్నో ఔషధ గుణాలతో కలిగి ఉంటుంది. ముఖ్యంగా కచ్చమామిడి కాయ, చింతపండు, బెల్లం శరీరంలోని రుగ్మతలను తట్టుకునే శక్తి ఉందని శాస్త్రీయంగా నిరూపితమైంది. వేప పువ్వును పచ్చడిలో వాడటం ప్రత్యేకత. బెల్లంను నేరుగా తింటే శరీరానికి వేడి చేస్తుంది. పానీయంగా వాడితే ఎండనుంచి రక్షించుకోవచ్చు.

38వ తెలుగు సంవత్సరం.. 60 తెలుగు సంవత్సరాలలో 38వది క్రోధినామ సంవత్సరం. ఇది కోపానికి సూచిక.. నేడు కొంగొత్త శ్రీక్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఉగాది పర్వదినం నిర్వహిస్తారు.





ఉన్నతవిద్యను బలోపేతం చేయాలి



సింపోజియంలో మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్, పాల్గొన్న అధ్యాపకులు

- హయ్యర్ ఎడ్యుకేషన్ నిర్లక్ష్యానికి గురైంది
- వర్సిటీల్లో అధ్యాపకుల కొరత.. నిధులు కేటాయింపు తక్కువ
- ఉన్నతవిద్యలో ప్రతికూల ప్రభావం
- కేయూలో కుర్తా సింపోజియంలో వక్తలు

కేయూ క్యాంపస్ : యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను బలోపేతం చేసేందుకు, బడ్జెట్‌లో నిధులు అధికంగా కేటాయించాలి. రాష్ట్రంలో గత దశాబ్ద కాలం పాటుగా వర్సిటీల్లోని ఉన్నత విద్య నిర్లక్ష్యానికి గురైందని అధ్యాపకుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశోధనలపైన ప్రతికూల ప్రభావం చూపిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. వర్సిటీల్లోనూ, డిగ్రీ కళాశాలల్లోనూ విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని ప్రధానంగా విద్యార్థినుల (అమ్మాయిలు) సంఖ్య బాగా పెరిగిందని అందుకనుగుణంగా వారికి కూడా సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగంపై పాలకవర్గాలు విద్యా విధానాలు రూపొందించడంలోనూ అంతగా పట్టించుకోవటం లేదన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలోను బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు తక్కువగానే కేటాయిస్తున్నారన్నారు. విద్యారంగాభివృద్ధికి గత ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది స్పష్టం అవుతోందని వారు అభిప్రాయపడ్డారు. కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరిపాలన భవనంలో నిర్వహించిన సెనేట్ హాల్‌లో రాష్ట్రంలో ఉన్నత విద్య పరిస్థితులు, బలోపేతం అంశంపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సింపోజియంనకు కుర్తా అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.సదానందం అధ్యక్షత వహించారు. జనరల్ సెక్రటరీ ఆచార్య వడ్డె రవీందర్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ టి పాపిరెడ్డి, రిటైర్డ్ ఆచార్యులు కూరపాటి వెంకటనారాయణ మాట్లాడారు. ఈ సింపోజియంలో వచ్చిన అభిప్రాయాలపరంగా సూచనలు, సలహాలతో డాక్యుమెంట్ల రూపేణ ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని కుర్తా అధ్యక్షుడు సదానందం తెలిపారు.

చదివించినప్పుడే ప్రశ్నించే అవకాశం

వ్యక్తిగా తాను సొంతంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో డబ్బులు పెట్టి చదువుకుంటారు. వారు ఉన్నత విద్యను పూర్తి చేశాక తాము డబ్బులు సంపాదించేందుకే మొగ్గు చూపుతున్నారనేది స్పష్టమవుతోంది. ప్రభుత్వపరంగా విద్యను అందిస్తే సమాజం తనను చదివించింది అనే భావనతో విద్యను పూర్తిచేసిన వ్యక్తుల్లో సేవాభావం ఉంటుంది. అంతేగాకుండా సమాజం కూడా నైతికంగా ప్రశ్నించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ విద్య పటిష్టానికి సమాజంలోకి వెళ్లి సామాజికంగా చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

- హరగోపాల్, సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్

సింపోజియంతో కనువిప్పు కలగాలి



సమాజంలో విద్యావ్యవస్థ కీలకమైంది. విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యం. ఆల్‌ఇండియా ఎడ్యుకేషన్ సర్వే రిపోర్టు చూస్తే భారత దేశంలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ 28.4 శాతం ఉంటే తెలంగాణలో 40 శాతం వరకు ఉంది. ఇలాంటి సింపోజియం డిబేట్‌ల ద్వారా విద్యారంగ అభివృద్ధికి పలు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలి.

- ఆర్.లింబాద్రి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్

సరైన విద్యా విధానం లేదు



దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడిచినా నేటికి సరైన విద్యా విధానం లేదు. వివిధ ప్రభుత్వాల హయాంలో ఇప్పటి వరకు కోఠారి కమిషన్‌తో పాటు వివిధ కమిషన్లు వేశారు. నూతన జాతీయ విద్యావిధానం-2020 అని అంటున్నారు. కానీ నేటికి సరైన నిర్దిష్టమైన విద్యావిధానాన్ని రూపకల్పన చేయలేకపోయారు. కేంద్రం బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు తక్కువగానే కేటాయిస్తోంది.

- తాటికొండ రమేష్ కేయూ, వీసీ

గతంలో వర్సిటీలకు నిధులు ఇచ్చాం

తాను యూజీసీ చైర్మన్‌గా ఉన్నప్పుడు దేశంలో యూనివర్సిటీలకు రీసెర్చ్‌పర్పస్‌లో వివిధ ఫెలోషిప్స్ ఇచ్చాం. పరిశోధన పరంగా నిధులిచ్చి ప్రోత్సహించాం. తొలుత ఆయన జూమ్ మీటింగ్‌లో న్యూఢిల్లీ నుంచి కొద్ది సేపు మాట్లాడారు. గత పదేళ్లుగా యూజీసీకి నిధులు తగ్గిపోయాయన్నారు. ప్రభుత్వ ఉన్నత విద్యారంగంలో నాణ్యమైన విద్య తదితర అంశాల గురించి ఆయన వివరించారు.

- సుఖ్‌దేవ్‌థోరెట్, యూజీసీ మాజీ చైర్మన్

నాణ్యమైన విద్య అందించాలి



ఇంజనీరింగ్ విద్యలోనూ నాణ్యమైన విద్యను అందించాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థుల్లో ప్రతి ఏడాది బయటికి వస్తున్న వారిలో 30 శాతంమందికి ఉద్యోగానికి సంబంధించిన స్కిల్స్ ఉద్యోగ అర్హతలు ఉండటం లేదు. తాను హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీలో డిగ్రీ పూర్తిచేశాను. తాను సోమవారం ఆ కళాశాలను సందర్శించి చూశాను. రెగ్యులర్ ఫ్యాకల్టీ కొందరే ఉన్నారు. దీంతో విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడుతుంది.

- డాక్టర్ మోహన్‌రావు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్

మార్పునకు విద్య ఒక సాధనం



సామాజిక మార్పునకు విద్య ఒక సాధనం. విద్యార్థులు చదువుకోవాలని ఉన్నప్పటికీ వాటికి అనుగుణంగా సదుపాయాలు లేవు. ప్రభుత్వం టీచింగ్ ఫ్యాకల్టీని నియమించాలి. సంపూర్ణంగా అంతర్గతంగా పనిచేసే వాతావరణం కల్పించాల్సి ఉంటుంది. ఉన్నత విద్య రంగాభివృద్ధికి తగినంత నిధులు వర్సిటీలకు కేటాయించాల్సి ఉంటుంది.

- కోదండరామ్, తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు

సైన్స్‌తోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

- సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు

కేయూ క్యాంపస్ : నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సైన్స్‌తోనే సాధ్యమైందని సైన్స్‌పై విద్యార్థులు ఎక్కువగా ఆసక్తిని పెంపొందించుకోవాలని సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు అన్నారు. సోమవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో సైన్స్ విభాగం అధ్యాపకులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఏదైనా సంఘటన జరిగినప్పుడు నిజనిర్ధారణ కోసం సైన్స్‌ను ఆశ్రయిస్తారన్నారు. ముఖ్యంగా డీఎన్‌ఏ పరిశోధనతో వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. రాజకీయ నాయకులు తమ పదవీకాలం ముగియగానే సమాజంలో తెగతెంపులు అవుతాయన్నారు. కానీ శాస్త్రవేత్తకు నిరంతరం పరిశోధనల అనుసంధానం ఉంటుందన్నారు. కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ మాట్లాడుతూ.. అధ్యాపకులు తమకున్న అవకాశాలను అందిపుచ్చుకొనే విధంగా తరగతి గది పరిశోధనకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బోధన, పరిశోధన నిరంతర ప్రక్రియ అన్నారు. కొంతమందికి అవకాశాలు రావడంతో వారి సేవలు సమాజానికి వివిధ రకాలుగా ఉపయోగపడుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి మాట్లాడుతూ.. మానవాభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్, అధ్యాపకుడు డాక్టర్ ఆదిరెడ్డి, సైన్స్ విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా డాక్టర్ మోహన్‌రావు ఈ కళాశాల పూర్వ విద్యార్థి కావడంతో ఆయన కళాశాలను సందర్శించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు.



క్లుప్తంగా

మార్బుల్స్ ఏర్పాటుకు విరాళం అందజేత



తరిగొప్పుల: మండలకేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మ దేవాలయం ప్రాంగణంలో వేసేందుకు కావాల్సిన మార్బుల్స్ ఏర్పాటుకు గ్రామానికి చెందిన అర్జుల పోషిరెడ్డి కుమార్తె, అల్లుడు ఏనుగు స్నిగ్ధా, మధుసూదన్‌రెడ్డి గౌడ సంఘం కులపెద్దలకు విరాళం అందజేశారు. ఈ మేరకు సోమవారం రూ.1,16,000 నగదును తాళ్లపల్లి పోషయ్య, తాళ్లపల్లి అశోక్‌ల సమక్షంలో మార్బుల్ వ్యాపారికి అందజేశారు.

ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న కాంగ్రెస్



జఫర్‌గఢ్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన అందిస్తోందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. మండలంలోని రేగడి తండా గ్రామానికి చెందిన అయా తండాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఎమ్మెల్యే సమక్షంలో హనుమకొండలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కడియం కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానించి మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు పాటుపడాలని కోరారు. బానోత్ రాజేష్‌నాయక్, రవినాయక్, ఎంపీటీసీ సభ్యులు దేవేందర్ నాయక్ ఉన్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

బచ్చన్నపేట: ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ మద్దోజు విశాలాక్షి తెలిపారు. మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ ప్రారంభించి మాట్లాడారు. అలాగే గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. జీపీ కార్యదర్శి భాను పాల్గొన్నారు.

అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు



జనగామ: ప్రముఖ సినీ హీరో అల్లు అర్జున్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని గిర్ని గడ్డ రాజరాజేశ్వరి సేవా సదన్ అనాథ వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అల్లు అర్జున్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ బబ్లూ, చిరు శ్రీధర్, నర్సింహులు, శ్రావణ, శ్రీ కాంత్, నవీన్, బన్నీ, ప్రసాద్, నవీన్ ఉన్నారు.

బీజేపీలో చేరిక



జఫర్‌గఢ్: ఉప్పుగల్లు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ గాదెపాక చిరంజీవి కార్యకర్తలతో కలిసి వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ సమక్షంలో స్టేషన్‌ఘన్‌పూర్‌లో సోమవారం బీజేపీలో చేరారు. వారికి అరూరి రమేశ్ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నగేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'అరూరి' గెలుపునకు కృషి

చిల్పూరు: బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపునకు కృషిచేస్తామని వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరిన కార్యకర్తలు అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్, నాయకులు బాల్నె శ్రీనివాస్‌గౌడ్, మధుల ఆధ్వర్యంలో సామల రాములు, గట్టు వెంకటేశ్వర్లు, గడ్డం యాదగిరి, మాచర్ల రమేష్, రమేష్, సాగర్, మహేష్‌తో పాటు వంద మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు.

వడదెబ్బ నివారణకు చర్యలు తీసుకోవాలి

బచ్చన్నపేట: ప్రస్తుతం ఎండల దృష్ట్యా వడదెబ్బ నివారణకు చర్యలు తీసుకోవాలని మండలంలోని కొడవటూర్ ఏఎన్ఎం సునంద అన్నారు. సోమవారం గ్రామంలో ఈజీఎస్ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పనులకు వెళ్లే వారు ఉదయం పూటనే వెళ్లాలని, మధ్యాహ్నం ఇంట్లోనే ఉండాలని సూచించారు. వడ దెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆశలు అనిత, అనూష, టెక్నికల్ అసిస్టెంట్ స్వామి పాల్గొన్నారు.

క్యాలెండర్, పంచాంగం ఆవిష్కరణ



జనగామ: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు



శ్రీ క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు



త్రైత సిద్ధాంత క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

జనగామ: జిల్లా కేంద్రంలోని హనుమత్ రామనాథ సహిత సీతారామచంద్రస్వామి దేవాలయంలో సోమవారం ప్రముఖ జ్యోతిష్య పండితులు, డాక్టర్ మోహన కృష్ణ భార్గవ రచించిన తెలుగు క్యాలెండర్‌ను ప్రముఖులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా సత్సంప్రదాయక తెలుగు క్యాలెండర్‌ను ప్రచురిస్తున్నట్లు చెప్పారు. భారతీయ వైదిక విజ్ఞానాన్ని, సనాతన సంప్రదాయాలు, పాశ్చాత్య మోజులో కనుమరుగవుతున్న స్వచ్ఛమైన తెలుగు సంస్కృతులను పరిరక్షించేందుకు తనవంతు కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ గౌరవ అధ్యక్షుడు గజ్జెల నర్సిరెడ్డి, జక్కా నర్సిరెడ్డి, కందాడి మల్లారెడ్డి, యాదగిరి, యెలసాని కృష్ణమూర్తి, రాంబాబు, పాశం శ్రీశైలం, క్లెం నాగరాజు రెడ్డి, ఉమాకర్ రెడ్డి, జక్కా ఉపేందర్, పూర్ణచందర్, వేణు గోపాల్, రవి, సిద్ధి మల్లారెడ్డి, వరలక్ష్మీ, అలివేలు, జ్యోతి, శ్యామల, విజయలక్ష్మీ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ క్రోధి నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ

జిల్లా విశ్వబ్రాహ్మణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విశ్వ బ్రాహ్మణ సిద్ధాంతి బ్రహ్మశ్రీ రాళ్లబండి లంకేశ్వరాచార్యులు రచించిన శ్రీ క్రోధినామ సంవత్సర పంచాంగాన్ని సోమవారం పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆవిష్కరించారు. సంఘం వ్యవస్థాపకుడు కొక్కొండ జగదీశ్వరాచార్యులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు మారోజు మల్లికార్జునాచార్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నల్లనాగుల రాజు, పాను గంటి రామమూర్తి, పొత్కనూరి శ్రీధర్, ఆంజనేయాచారి, కందుకూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరణ

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం త్రైత సిద్ధాంత తెలుగు సంవత్సరాది ఉగాది క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన క్యాలెండర్‌లో భగవద్గీత వచనాలను జోడించి, ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా రూపొందించినట్లు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక జనగామ కమిటీ అధ్యక్షుడు శ్రీనాథ్ శ్రేష్ఠి, కార్య వర్గ సభ్యులు ఉపేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న అరూరి రమేశ్

స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని భారీ మెజార్టీతో గెలిపించే దిశగా కార్యకర్తలు కంకణబద్ధులై సైనికుల్లా పనిచేయాలని పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని మాగార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో, రఘునాథపల్లి మండలంలోని నిడిగొండ ఎస్‌వీ గార్డెన్స్‌లో జరిగిన స్టేషన్‌ఘన్‌పూర్ చిల్పూరు, జఫర్‌గఢ్, రఘునాథపల్లి, లింగాలఘణపురం మండలాల పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని నంబర్‌వన్‌గా చేశారని, దేశ ప్రజలందరూ మరోసారి మోదీ ప్రధాని కావాలని కోరుకుంటున్నారన్నారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు, వరంగల్ పార్లమెంట్ ప్రభారి మురళీధర్‌గౌడ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ మార్తినేని ధర్మారావు, జాతీయ కార్యవర్గ సభ్యులు తక్కళ్లపెల్లి రాజేశ్వరరావు, బొజ్జపల్లి సుభాష్, కుమారస్వామి, అంజిరెడ్డి, మురళీధర్‌రెడ్డి, చిలుక విజయరావు, యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



పాలకుర్తి: విద్యుదాఘాతంతో మృతి చెందిన బైకాని శ్రీశైలం కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే సోమవారం తీగారం వెళ్లి మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

శ్రీశైలం భార్యకు ఉద్యోగం ఇవ్వాలి

పాలకుర్తి టౌన్: విద్యుదాఘాతంతో మృతి చెందిన ఉద్యోగి బైకాని శ్రీశైలం భార్యకు ఉద్యోగం ఇప్పించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య డిమాండ్ చేశారు. పాలకుర్తిలో చిట్యాల ఐలమ్మ స్మారక భవనంలో సోమ సత్యం అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సారయ్య మాట్లాడారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే శ్రీశైలం మృతి చెందాడని అన్నారు. సీపీఎం నాయకులు సోమ అశోక్ బాబు. బెల్లి సంపత్, పనికిరా భాస్కర్ పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది సంబురాలు



జనగామ: మృదుల కిడ్స్‌లో ఉగాది సంబురాల్లో పాల్గొన్న చిన్నారులు



ఎస్‌పీఆర్ కిడ్స్‌లో..

జనగామ: పట్టణంలోని మృదుల కిడ్స్‌లో సోమవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది ముందస్తు సంబురాలను నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింభించేలా రంగవల్లులు వేసి, పిల్లలతో కలిసి షడ్రుచులతో పచ్చడి తయారు చేశారు. ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు రేణుక, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీఆర్ కిడ్స్‌లో..

పట్టణంలోని బాలాజీనగర్ ఎస్‌పీఆర్ కిడ్స్‌లో ముందస్తు ఉగాది వేడుకలను నిర్వహించారు. పిల్లలకు పండుగ ప్రాముఖ్యతను తెలియజేశారు. షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని పిల్లలతో పాటు తల్లి దండ్రులకు అందజేశారు. కీర్తి వీరేందర్, ప్రిన్సిపాల్ శోభ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో బాల కవిసమ్మేళనం

లింగాలఘణపురం: మండలంలోని మాణిక్యాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బాల కవి సమ్మేళనం పోటీలు నిర్వహించగా బాలలు ఉగాది కవితలను వినిపించి అబ్బుర పరిచారు. నిమ్మ జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా హెచ్ఎం వెంకటరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురై మహిళ మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



నిర్మల(ఫైల్)

జనగామ : పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన బొమ్మగాని నిర్మల(62) వడదెబ్బతో అస్వస్థతకు గురై సోమవారం మృతిచెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఓ హోటల్‌లో రోజువారీ కూలీగా నిర్మల పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే రెండు రోజుల క్రితం నిర్మల మండుటెండలో హోటల్‌లో పనిచేసేందుకు నడుచుకుంటూ వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత డీహైడ్రేషన్‌కు గురై కుప్పకూలి పోయారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స అందజేశారు. కాగా ఆదివారం అర్ధరాత్రి నిర్మల పరిస్థితి విషమం కావడంతో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఆమె మృతిచెందారు. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, మృతురాలి కుమారుడు బొమ్మగాని శ్రీకాంత్ గౌడ్ జర్నలిస్టుగా పని చేస్తుండగా, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీపీఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎం.డీ జహంగీర్, సీపీఎం లీడర్లు జోగు ప్రకాశ్, బుడిద గోపి, కాంగ్రెస్ నేతలు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మేడ శ్రీనివాస్, చెంచారపు బుచ్చిరెడ్డి, కౌన్సిలర్లు, జర్నలిస్టులు ఆమె మృతదేహంపై పుష్పగుచ్ఛం వేసి నివాళులర్పించారు.

వివాహిత అనుమానాస్పద మృతి !



నాగమణి మృతదేహం

నర్మెట: వివాహిత అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన మండలంలోని లోక్యతండా ఆవాసప్రాంతం హనుమశ్చంద్ర తండాలో సోమవారం చోటుచేసుకుంది. రఘునాథపల్లి మండలం మంగలిబండ తండాకు చెందిన నాగమణి (20)కి హనుమశ్చంద్రు తండాకు చెందిన బానోత్ వేణుతో రెండేళ్ల క్రితం వివాహం కాగా 4 నెలల బాబు ఉన్నాడు. భర్త హైదరాబాద్‌లో పెట్రోల్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా భార్య భర్తల మధ్య గొడవ కారణంగా గత కొద్ది రోజులుగా మృతురాలు అత్తామామలతో తండాలోనే ఉంటున్నది. ఈక్రమంలో బంధువుల వివాహానికి మూడురోజుల క్రితం భర్త తండాకు వచ్చాడు. కాగా, సోమవారం ఉదయం నాగమణి ఇంటిముందు నిర్జీవంగా పడి ఉండటం ఉపాధిహామీ పనులకు వెళ్లిన తండావాసులంతా ఇళ్లకు చేరుకోవడం పురుగుల మందు తాగిందని భర్త వారికి తెలిపినట్లు సమాచారం. తండావాసులిచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది నాగమణి మృతిచెందినట్లు తెలపడంతో మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆస్పత్రికి చేరుకున్న మృతురాలి బంధువులు తమకు న్యాయం జరిగేవరకు పోస్టుమార్టం నిర్వహించేది లేదని పట్టుబట్టడంతో మృతదేహాన్ని మార్చురీలోనే ఉంచారు.ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఛాగల్లులో వాటర్‌ప్లాంట్ పునఃప్రారంభం



వాటర్‌ప్లాంట్ ప్రారంభంలో కమిటీ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లులో గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుకవైపు ఉన్న మినరల్ వాటర్ ప్లాంటు ఎట్టకేలకు పదేళ్ల తర్వాత పునఃప్రారంభమైంది. దాత ఇనుగాల చిత్తరంజన్‌రెడ్డి, బాలవికాస సహకారం, గ్రామ ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్, గ్రామ పెద్దల చొరవతో సోమవారం మాజీ సర్పంచ్ ఇనుగాల జవహర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాటర్‌ప్లాంట్‌కమిటీ చైర్మన్ కనకం రమేష్ , కమిటీ బాధ్యులు కుందూరు వెంకట్‌రెడ్డి, గాండ్ల మల్లిఖార్జున్, కమిటీ అధ్యక్షులు కత్తెరశాల సంజీవ, ఇనుగాల నర్సింహారెడ్డి, భాస్కుల ఎల్లయ్య, బూర్ల యాదగిరి, రవీందర్, బుగులయ్య, అనీల్‌కుమార్, రాంమోహన్‌రెడ్డి, రాములు, సత్తు రవీందర్, లక్ష్మీనారాయణ, చిరంజీవి, సంపత్‌రాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

చిల్పూరు: ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి గాయపడి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొదుతున్న సబావత్ మల్లేష్ (22) సోమవారం మృతి చెందాడు. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా తాళ్లకొండపల్లి మండలం చుక్కతండాకు చెందిన మల్లేష్ ఈనెల 5వ తేదీన హైదరాబాద్ నుంచి నర్సంపేట అత్తగారింటికి బైక్‌పై వస్తూ చిన్నపెండ్యాల ఆకేరు బ్రిడ్జి సమీపంలో బైక్ అదుపుతప్పి గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అన్న రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రశ్నించే గొంతుకకు పట్టం కట్టండి



మాట్లాడుతున్న జహంగీర్

బచ్చన్నపేట: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకకు పట్టం కట్టాలని సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం మండల ఇన్‌చార్జ్ సుంచు విజేందర్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యలపై ముందుంటున్న సీపీఎంను ఆదరించాలని కోరారు. నాయకులు రామగళ్ల అశోక్, అన్నెబోయిన రాజు, పర్వతం నర్సింహులు, కడకంచి బాలరాజు, శోభ, రాములు, పోచయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'కొనుగోలుదారులు పూర్తి సమాచారం తెలుసుకోవాలి'

చిల్పూరు : భూమి కొనుగోలుదారులు వాటికి సంబంధించిన పూర్తి వివరాలు, సమాచారం తెలుసుకున్నాకే కొనాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ సూచించారు. సోమవారం ఏసీపీ కార్యాలయం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో భూతగాదాలు ఎక్కువగా ఉన్నాయని దీనికి భూములు కొనుగోలు చేస్తున్న సమయంలో వివరాలు తెలుసుకోకపోవడమే కారణమన్నారు. గతంలో భూములు కొనుగోలు చేసే సమయంలో సరైన పత్రాలు ఉన్నాయా? లేవా అని చూడకుండా కొనుగోలు చేశారని, ఇప్పుడు ధరలు పెరిగాక తగాదాలు మొదలయ్యాయని అన్నారు.

ఎంపీ అభ్యర్థిని కలిసిన నాయకులు



జనగామ: భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో మాజీ మున్సిపల్, మార్కెట్ చైర్మన్లు ఎర్రమల్ల సుధాకర్, వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కంచె రాములు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ వ్యూహాలపై చర్చించినట్లు చెప్పారు. అంతకు ముందు వేం నరేందర్‌రెడ్డిని కలిసి సత్కరించారు.

ఎంపీ అభ్యర్థి కావ్యను కలిసిన కాంగ్రెస్ నాయకులు

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ అభ్యర్థి కావ్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పూర్తి మద్దతు తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

బచ్చన్నపేట: ఓటు హక్కును అర్హులు స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకూడదని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు అవగాహ కల్పించారు. మండల కేంద్రంలో సోమవారం వారు కళాజాత ద్వారా అవగాహన కల్పించారు.

స్థపతికి ఆహ్వానం

చిల్పూరు: ఈనెల 17వ తేదీన నిర్వహించే మండలంలోని నష్కల్ గ్రామంలోని సీతా రామచంద్రస్వామి ఉత్సవాలకు హాజరు కావాలంటూ సోమవారం హైదరాబాదులో ప్రముఖ స్థపతి డీఎస్‌వీ ప్రసాద్‌ను ఆలయ సేవా సొసైటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలుసుకుని ఆహ్వానించారు.

ఆర్థికసాయం

తరిగొప్పుల: చెందిన తాళ్లపల్లి బక్కయ్య ఇటీవల తాటిచెట్టు పైనుంచి జారిపడి మృతిచెందాడు. కాగా, మృతుడి కూమార్తె అంజలితో కలిసి చదువుకున్న 2010–11 బ్యాచ్ పదో తరగతి స్నేహితులు పోగుచేసిన రూ.10,100 నగదును సోమవారం అందజేశారు. రాజు, సంపత్, సృజనకుమార్ ఉన్నారు.

విజయవంతం చేయండి

పాలకుర్తి: బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేశ్ గెలుపే లక్ష్యంగా నిర్వహిస్తున్న భూత్ కమిటీల సమ్మేళనాలను విజయవంతం చేయాలని పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ పూసాల శ్రీమాన్ అన్నారు. సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు దుంపలి సంపత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహేందర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు పాటుపడుదాం..

దేవరుప్పుల: భారతీయ జనతా పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ విజయం సాధించడానికి పార్టీ శ్రేణులం పాటుపడాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కాసాని సత్తయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు.

నాలుగు రోజులు.. రెండు పార్టీలు

స్టేషన్‌ఘన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండగా రోజురోజుకు ఎన్నికల చిత్రాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే మండలంలోని మీదికొండ గ్రామానికి చెందిన సీనియర్ కార్యకర్త చిలువేరు ముత్యాలు ఈనెల 4న హైదరాబాద్‌లో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాడు. అయితే సోమవారం ఘన్‌పూర్‌లో జరిగిన బీజేపీ సమావేశంలో పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ సమక్షంలో బీజేపీలో చేరాడు.

వ్యక్తి రిమాండ్

జనగామ: పట్టణంలోని నాగులకుంటకు చెందిన కరుణాకర్ ఓ వ్యక్తిని నిర్బంధించిన ఘటనలో వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం అతనిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సృజన్ తెలిపారు. కరుణాకర్ స్వగృహంలో కరెంటు పని చేసేందుకు ఆకారం శ్రీనివాస్ అనే వ్యక్తి వెళ్లే క్రమంలో ఇంట్లో రూ.12వేల 600 చోరీ చేశాడని ఆరోపిస్తూ రోజంతా చిత్రహిసలకు గురి చేశాడన్నారు. అలాగే బలవంతంగా శ్రీనివాస్‌తో ప్రామిసరీ నోట్ రాయించుకోగా, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, కరుణాకర్‌ను కోర్టులో రిమాండ్ చూపించినట్లు ఎస్సై తెలిపారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

దేవరుప్పుల: మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట రమదారి చౌరస్తాలో ఓ ప్రైవేత పాఠశాల బస్సును మీని గూడ్స్ వాహనం ఢీకొట్టడంతో త్రుటిలో పెనుప్రమాదం తప్పిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులతో చౌరస్తాలో తిప్పుతుండగా హైదరాబాద్ నుంచి ఖమ్మంనకు వెళ్తున్న గూడ్స్ మినీవాహనం వేగంగా వచ్చి ఢీకొట్టడంతో బస్సు వెనుకభాగం, గూడ్స్ బండి ఇంజన్ నుజ్జునుజ్జు అయింది.. ఈ సంఘటనతో బస్సు కుదుపడంతో చిన్నారులు చెల్లాచెదురయినప్పటికీ ఎవరికి గాయాలు కాలేదు. కానీ గూడ్స్ డ్రైవర్ స్టీరింగ్ మధ్య ఇరుక్కపోవడంతో స్థానిక ఆటోడ్రైవర్లు తీయడంతో పెద్ద ప్రమాదం నుంచి బయటపడినట్లయింది.

చికిత్స పొందుతున్న వీఆర్‌ఏ మృతి

దేవరుప్పుల: సీతారాంపురానికి చెందిన వీఆర్ఏ ఎండీ ఖాజాబీ హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వీఆర్ఏ అంత్యక్రియల్లో ఎంపీపీ సావిత్రి మల్లేషం, నాయబ్ తహసీల్దార్, ఆర్ఐలు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

జనగామ: జిల్లా కేంద్రం ఇండస్ట్రియల్ ఏరియాలోని ఓ గోదాం నుంచి 75 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా టాస్క్ ఫోర్స్ బృందం పట్టుకున్నట్లు ఎస్సై రఘుపతిరెడ్డి తెలిపారు. ఏపీ 7 టీడీ 0239 నంబరు గల లారీలో రేషన్ బియ్యం తరలిస్తుండగా, పట్టుకుని కేసు నమోదు చేసి, డ్రైవర్ అంకూరి రామస్వామిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.